# హార్ట్ పేషెంట్

పి. ఎస్. నారాయణ

సూర్యనారాయణకు లాటరీలో థర్డ్ ప్రయిజ్ వచ్చింది. యాభై వేలు. ఆ విషయం ముందుగా చూచింది పక్కింటి రామ్మూర్తి. రామ్మూర్తి, సూర్యనారాయణ మంచి స్నేహితులు. మొగవాళ్ళకు, ఆడవాళ్ళకు కూడా మంచి స్నేహమున్నది. రోజూ పేపరు యిద్దరూ కలపి తెప్పించుకుంటారు. ముందు రామ్మూర్తి ఇంట్లో పేపరు పడేస్తే అతడు చదివి సాయంత్రానికి సూర్యనారాయణ ఇంటికి పంపిస్తాడు.

సూర్యనారాయణ రోజూ చెబుతున్న విషయమే అది—తనకు లాటరీలో డబ్బు వస్తుందని—తన జాతకంలో అలా రాసి వుందనీ. అందుకనే కనబడ్డ లాటరీ టిక్కెట్టల్లా కొని పడేస్తుంటాడు. పొద్దున్నే ముందు రామ్మూర్తి పేపరు చూస్తాడు కాబట్టి రామ్మూర్తికి నెంబర్లన్నీ ఇస్తుంటాడు.

సూర్యనారాయణ రోజూ చెప్పేది నిజమే అయి కూర్చున్నది ఆ రోజు పేపర్లో. క్రితంరోజు సూర్యనారాయణ చెప్పిన నెంబరు వస్తయి అనుకుంటున్న రిజల్ట్సులో కనబడింది రామ్మూర్తి తన మిత్రుడికి వచ్చిన సంపదకు సంతోషించాడు

బనీనుమీదే సూర్యనారాయణదగ్గరకు బయల్దేరాడు. బయటకు చేతిలో పేపరు తోనే రాబోతూ భార్య చెవిలోగూడా ఒక మాట వేద్దాం అన్నట్లుగా పిలిచి—అసలు విషయం చెప్పి—"ఆయనతో చెప్పేసి వస్తాను" అన్నాడు.

భార్య గబుక్కున ముందుకు వచ్చింది. "మీకేమైనా పిచ్చా... ఆగండి ముందు....ఆయనకు అసలే గుండె జబ్బని తెలుసుగదా మీకు—చిన్నగా ఆలోచించి చెప్పండి!" అన్నది.

"నిజమే!" అన్నాడు తన పొరపాటుకు తడబడుతూ "ఇప్పుడెలా మరి అయితే!"

భార్యే సలహా యిచ్చింది. "డాక్టర్ గారిని పిలవండి ..పక్కింటి వెంకట్రావుగారిని పిలవండి. ..అటు జగన్నాథంగారిని గూడా పిలిచి సలహా అడగండి....తరువాత ఏమైనా అయిందంటే నీకేమైనా బుద్ధుందా లేదా....హార్ట్ పేషెంట్‌కు చెప్పే తీరు అదేనా అని మిమ్మల్ని తిట్టిపోస్తారు!"

"నిజమే!"

రామ్మూర్తి ముందు పక్కింటి జగన్నాథంతో సంప్రదించాడు. ఆపైన వెంకట్రావును కేకేశాడు. ఆ తరువాత బి.ఎ. చదువుతున్న జగన్నాథంకొడుకుకు సైకిలిచ్చి డాక్టరుకు అసలు సంగతి చెప్పి మందులసంచీ తెమ్మనమని ఖబురు పంపించాడు.

డాక్టరుగూడా వచ్చిం తరువాత అంతా కలపి సూర్యనారాయణగారింటికి బయల్దేరారు.

అప్పటికే ఎనిమిదయింది. ఎండాకాల మేమో ఎండగూడా బాగా వచ్చేసింది.

అందరూ రామ్మూర్తి ఇంట్లోనే—ఏమేం చేయాలో—ఎవరెవరు ఏ పొజిషన్లలో

నిలబడాలో గూడా నిర్ణయం చేసుకున్నారు.

ముందు రామ్మూర్తి, వెనగ్గా డాక్టరు. ఆయన వెనగ్గా జగన్నాధం, వెంకట్రావు. సూర్యనారాయణ ఇంట్లో కాలుపెట్టారు

వీళ్ళంతా వెళ్ళేటప్పటికల్లా కాఫీ త్రాగుతూ ఉయ్యాలబల్లమీద కూర్చొని వున్నాడు సూర్యనారాయణ. దూరంగా గడపక్రిందగా భార్య కూర్చొనివున్నది

ఒక్కసారిగా గుంపుగా వస్తున్న అందరినీ చూస్తూనే సూర్యనారాయణ— ఉయ్యాలబల్లమీద ఒక్క ఊగు ఊగి— "రండి రండి ఏదో విశేషం ఉండి ఉండాలి'" అంటూ ఆహ్వానించాడు నవ్వుతూ. "కాఫీ కలపవే!" అంటూ భార్యకు పురమాయించాడు గూడా.

"చూచారు సూర్యనారాయణగారూ! మనం మనుష్యులం వయస్సు వచ్చిన వాళ్ళం సంతోష మొచ్చినా, దుఃఖ మొచ్చినా ఏదో చాలా మామూలు విషయంలా సర్ది చెప్పుకొని తేలిగ్గా తీసుకోవాలి ఏమీ జరగనట్లుగానే!" అన్నాడు రామ్మూర్తి.

అప్పటికే డాక్టరుగారు మందులసంచీ ఉయ్యాల బల్లమీద పెట్టి కన్ను మూసి తెరిచేలోగా తీసేందుకు వీలుగా దానిమీద చేయివేసి నిలబడ్డారు వెనగ్గా వెంకట్రావు వెళ్లాడు కుడిపైపు జగన్నాధం నిల్చున్నాడు.

"ఇంతకీ ఏమైంది?" అన్నాడు సూర్యనారాయణ ఆత్రంగా ముందుకువంగుతూ.

"ఏముంది వడ్లగింజలో బియ్యపు గింజ మా నోళ్ళు తియ్యబరచాలి మీరు కాఫీ త్రాగుదామని మీ ఇంటికి వచ్చేశాం!

అంతే !" దీర్ఘం తీశాడు రామ్మూర్తి. "ముందు పంచదార డబ్బా యిటు తెప్పించండి!"

డాక్టరుగారు మూత తెరిచేశాడు కిట్ది!

జగన్నాధం సూర్యనారాయణనే పట్టుకున్నట్లుగా ఉయ్యాలబల్ల గొలుసు పట్టుకున్నాడు.

"చెప్పండి బాబూ! . నాకు లాటరీ ఏమైనా తగిలిందా నా జాతకరీత్యా ఈ నెల్లో వచ్చి తీరాలి మరి!" అన్నాడు హుషారుగా ఆయన

'ఫరవాలేదు గురుడు లైనుకో పడుతున్నాడు!' అనుకుంటూ రామ్మూర్తి ఒక అడుగు ముందుకు వేశాడు ఆయన్ను పడిపోనివ్వగూడదు అన్నట్లుగా ఆయన భుజంమీద చేతులు వేశాడు.

వెనకాల వున్న యిద్దరూ గూడా ముందుకు వంగారు.

రామ్మూర్తి నోరు తెరిచి, "అనవసరంగా ఎక్సయిట్ అవబోకండి సూర్యనారాయణగారూ! మీకు లాటరీలో థర్డ్ ప్రయిజు యాభై వేలు వచ్చింది హార్టీ కంగ్రాట్స్! " అన్నాడు.

సూర్యనారాయణ రామ్మూర్తిని తీక్షణంగా చూచాడు. మొఖం చిట్లించాడు "థర్డ్ ప్రయిజా! యాభై వేలా? ఫస్ట్ ప్రయిజ్ కాదన్నమాట ఒకలక్షా యాభై వేలు నష్టమన్నమాట!" వటుక్కున పక్కకు పడిపోయాడు.

డాక్టరుగారు యింజక్షన్ సిరంజ్ బయటకు తీసేలోగానే లక్షాయాభై వేలు ఘోరంగా నష్టపోయిన సూర్యనారాయణ 'హరీ' అన్నాడు! □